సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

# హమాలీలకు సమగ్ర వేతన చట్టం

## - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

**ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్**

హమాలి కార్మికులకు సమగ్రమైన వేతన చట్టం తీసుకురావాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.రాధాకష్ణ ఎండి అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో శనివారం హమాలీ కార్మికుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ హమాలీ కార్మికులు దుర్భరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. వయసు ఉన్నప్పుడు కష్టపడి పనిచేసి కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న హమాలీ కార్మికులు వయసు మీద పడిన తర్వాత వృద్ధాప్యంలో తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అందుకని హమాలీల ఆరోగ్య సమస్యలు పరిష్కారం కోసం సమగ్రమైన ఒక చట్టం తీసుకురావాలన్నారు. గవర్నమెంట్ హమాలి కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రభుత్వమే వారికి వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. వయసు మీద పడిన తర్వాత వారికి కనీస పెన్షన్ అమలయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారానికి సంక్షేమ బోర్డు సంక్షేమ బోర్డును చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హమాలీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర కమిటీ ఇచ్చిన దశలవారీ ఆందోళనలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సంతకాల సేకరణ, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేయడం, ఆగస్టు 2న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయడం, ఆగస్టు 17న చలో కలెక్టరేట్ ముట్టడి జయప్రదానికి హమాలీ కార్మికులు కలిసిరావాలన్నారు. సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, న్యూ సిటీ కార్యదర్శి సాయిబాబా, అధ్యక్షులు నరసింహులు, వేర్ హౌస్ యూనియన్ నాయకులు విజయుడు నాగస్వాములు పాల్గొన్నారు.

**మహా పాదయాత్రను జయప్రదం చేయండి:** మహా పాదయాత్రను జయప్రదం చేయాలని రాధాకృష్ణ, అంజిబాబు హమాలీలను కోరారు. సిపిఎం ఈనెల 26 నుండి 31వరకు చేయనున్న మహా పాదయాత్రలో హమాలి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. జిల్లా అభివద్ధి చెందితేనే హమాలీ కార్మికులకు పనులు దొరుకుతాయని, జిల్లా కరువు కాటకాలతో ఉంటే పనులు దొరకవని అన్నారు.

# 2 వేల విద్యా వాలంటీర్ల పోస్టులు భర్తీ

- పెండింగ్ గృహ నిర్మాణాలు పూర్తి చేస్తాం - ఉర్దూ వర్సిటీ పనులు చేపడతాం
- జడ్‌పి సమావేశంలో మంత్రులు అంజాద్ బాష, గుమ్మనూరు జయరాం
- కర్నూలు డిఇఒపై ఎమ్మెల్యే రామిరెడ్డి ఆగ్రహం - సిపిడబ్ల్యు స్కీంల మరమ్మతులు ప్రభుత్వమే భరించాలి : జడ్‌పిటిసిలు

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనేక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో తాత్కాలికంగా 2000 విద్యా వాలంటీర్ల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ ప్రకటించారు. జడ్‌పి నిధుల నుంచే విద్యా వాలంటీర్లకు నెలకురు రూ.10000 గౌరవ వేతనంగా చెల్లించేందుకు అంగీకరిస్తూ తీర్మానం చేసి పంపామని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జగనన్న కాలనీలో చేపడుతున్న గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. నంద్యాల జిల్లా ఇన్చార్జి మంత్రి , ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన, జిల్లా పరిషత్ సిఇఒ నాసర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళంగా నిర్వహించారని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కర్నూలు డిఇఒ వెంకట రంగారెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉర్దూ బోధించే ఉపాధ్యాయురాలని ఇంగ్లీష్ బోధించాలని బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అడ్డగోలుగా ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించారని డిఇఒపై మండిపడ్డారు. వెంటనే బదిలీలను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లాలో చేపడుతున్న పంటల బీమాలో రైతులకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఎమ్మెల్సీ రాజగోపాల్ రెడ్డి మంత్రుల దృష్టికి తెచ్చారు. వైఎస్ఆర్ పంటల బీమాగా పేరు మార్చారు కానీ రైతులకు మాత్రం ఈ పథకం లబ్ధి చేరడం లేదన్నారు.

నాడు నేడు ద్వారా జరుగుతున్న పనులకు బిల్లుల సరిగా మంజూరు కావడం లేదని జడ్‌పిటిసిలు ప్రస్తావించారు. బిల్లులను త్వరగా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రుల దృష్టికి తెచ్చారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించి నిధులను సరిగా ప్రభుత్వం విడుదల చేయడం లేదని జడ్‌పిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిడబ్ల్యు స్కీమ్స్ పర్యవేక్షణకు జడ్‌పి నిధులను వాడటం సరైనది కాదని జడ్‌పిటిసిలు మంత్రుల దృష్టికి తెచ్చారు. అవసరమైతే

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు, కలెక్టర్, జడ్‌పి చైర్మన్

రాష్ట్ర ప్రభుత్వమే నిధులను భరించేలా సిఫార్సు చేయాలని మంత్రులు జడ్‌పి చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఉర్దూ యూనివర్సిటీ పనులు మధ్యలోనే ఆగిపోయాయని మంత్రుల దృష్టికి ఓర్వకల్ జడ్పిటిసి తీసుకువచ్చారు. ఇక్కడ పనులను త్వరగా పూర్తిచేస్తే మైనారిటీలకు ఉర్దూ విద్యాబోధనకు ఇబ్బంది ఉండదని అన్నారు. జిల్లా పరిషత్ లోని అతిథి గృహంలో మరమ్మతులు చేపట్టి జడ్పిటిసి సభ్యులకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి మహిళా జడ్‌పిటిసిలకు ప్రత్యేకంగా వసతి కల్పించాలని కోరారు.

**ఉర్దూ యూనివర్సిటీపై సిఎం ప్రత్యేక దృష్టి : మంత్రులు**

సమావేశం అనంతరం మీడియాతో మంత్రులు అంజాద్‌బాష, గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి ఉర్దూ వర్సిటీ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని అన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి నిధులను కూడా విడుదల చేయాలని శాఖ అధికారులను ఆదేశించారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నాడు నేడు కింద చేపడుతున్న పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇప్పటివరకు పెండింగులో ఉన్న గృహాలను త్వరగా పూర్తిచేసేలా చూడాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. జడ్‌పి చైర్మన్ సమావేశంలో చేసిన తీర్మానాలను వెల్లడించారు. కెజిబివి పాఠశాలల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేలా అనుమతించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉన్న నేపథ్యంలో విద్యా వాలంటీర్ల నియామకాలకు అనుమతించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నమన్నారు. జిల్లాలో సిపిడబ్ల్యు స్కీం పథకాల నిర్వహణకు అవసరమయ్యే నిధులను ప్రభుత్వమే భరించాలని కోరామన్నారు. త్వరలో ఐఎబి సమావేశంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, టి.ఆర్థర్, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, డాక్టర్ జె.సుధాకర్, ఎమ్మెల్సీ మధుసూదన్, జడ్‌పి వైస్ చైర్మన్లు, జడ్పిటిసి సభ్యులు, ఎంపిపిలు, కర్నూలు నంద్యాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కెడిసిసి బ్యాంకు చైర్మన్...

## విజయ మనోహరి బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్**

కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 'పర్సన్ ఇన్‌ఛార్జీ చైర్మన్‌గా ఎస్‌వి.విజయ మనోహరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధి దిశగా పయనించేలా కృషి చేస్తామని తెలిపారు. అలాగే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతుల పరపతి అవసరాలను తీర్చేందుకు తన ఆధ్వర్యంలోని పాలకవర్గం మరింత పట్టుదలతో కృషి చేస్తుందని తెలిపారు. బ్యాంకు ఉన్నతాధికారులు, సీనియర్ అధికారులు, ఇతర బ్యాంకు సిబ్బంది, కర్నూలు, నంద్యాల జిల్లాలోని అన్ని సంఘాల అధ్యక్షులు, సిబ్బంది సహాయ, సహకారాలు అందించాలని కోరారు. అందరి సహకారంతో కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ఆర్థికంగా ఉన్నత స్థానానికి చేరుస్తామని చెప్పారు. అనంతరం బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు విజయ మనోహరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంకు ఆర్థిక పరిస్థితులు, జిల్లా రైతుల ఆర్థిక అవసరాలు తీర్చేందుకు బ్యాంకు చేపట్టిన నూతన పథకాల గురించి వివరించారు.

చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామాంజనేయులు

# మహా పాదయాత్రకు సన్నద్ధం...

**ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి**

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 26 నుంచి 31 వరకు కర్నూలు జిల్లావ్యాప్తంగా నిర్వహించే మహాపాదయాత్ర కోసం సిపిఎం ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా కర్నూలు నగరంలో ఇంటింటికీ తిరిగి సిపిఎం బృందాలు సమస్యలను సేకరిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండలకేంద్రాల్లో సమావేశాలు, సభలు నిర్వహించి మహాపాదయాత్ర ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరింది. జిల్లా కేంద్రం నుంచి రాజధాని అమరావతికి రోడ్డు, రైలు మార్గాలు వేసి, కర్నూలు నుంచి అమరావతికి రెగ్యులర్ రైలు నడపాలన్నారు. రైల్వే వ్యాగన్ వర్క్ షాపును త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదోని, ఎమ్మిగనూరులలో టెక్స్‌టైల్ పార్కులను నిర్మించాలన్నారు. సమస్యల పరిష్కారానికి సిపిఎం దశలవారీ ఆందోళనల్లో భాగంగా ఈనెల 10 వరకు గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి సచివాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చారు. రెండో దశలో 11, 12, 13న కరపత్రాలు వేసి అన్ని నియోజకవర్గాల్లో ఆరు జీపుజాతాల ద్వారా ప్రచారం చేపట్టారు. పాదయాత్ర ఈనెల 26న ఆదోనిలో ప్రారంభం కానుంది. ప్రారంభ సభకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ హాజరు కానున్నారు. 31న నిర్వహించే మహా ధర్నా, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు హాజరు కానున్నారు.

**సాగుపై ఆశలు..**

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఒక మోస్తారు వర్షం కురిసింది. రైతుల్లో సాగుపై ఆశలు చిగురించాయి. జిల్లాలో విత్తన సాగు కనీసం 20 శాతం కూడా పూర్తి కాలేదు. బావుల కింద బోర్ల కింద అక్కడక్కడ సాగు జరిగింది. వర్షాధార పంటలు కొన్ని చోట్ల సాగు జరిగినా వర్షాభావ పరిస్థితుల వల్ల మొలకెత్తిన పంట కూడా వాడుముఖం పట్టాయి. కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, కల్లూరు, ఓర్వకల్, తదితర మండలాలతో పాటు కొన్ని చోట్ల మోస్తారు వర్షపాతం నమోదయింది. కర్నూలు నగరంలో భారీ వర్షం కురిసింది. నగరంలోని చాలా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. కొన్ని మండలాల్లో వర్షం కురవడంతో రైతులు విత్తనానికి సిద్ధమయ్యారు. జూన్ నుంచి సరైన వర్షపాతం లేనందున విత్తనానికి పదును లేకపోవడం వల్ల విత్తనసాగు జరగలేదు. వర్షం పడటం వల్ల విత్తనానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే వర్షం కురవకపోవడం వల్ల పంటలు ఆలస్యం అయ్యాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేటి నుండి అయినా వర్షం కురిస్తే విత్తనానికి సానుకూలంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. సరైన సమయంలో విత్తనం సాగు కాకుంటే దిగుబడులు కూడా అంతంత మాత్రం వస్తాయని రాష్ట్రంలో అత్యల్ప వర్షపాతం నమోదయిన జిల్లాలో కర్నూలు జిల్లా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆశాల ఆందోళన...**

తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. కర్నూలు, నంద్యాలలో డిఎంహెచ్ఒ కార్యాలయ ముట్టడి నిర్వహించారు. ఆశాల సమస్యలు పరిష్కరించి తీరాలని పట్టుబట్టారు. డిఎంహెచ్ఒలకు వినతి పత్రాలు సమర్పించారు.

## ఓటు హక్కు కోసం ఇంటింటి సర్వే

**ప్రజాశక్తి -తుగ్గలి**

పద్దెనిమిది సంవత్సరాలు దాటిన యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తుగ్గలి తహసీల్దార్ రవి అన్నారు. శనివారం ఓటు హక్కు దరఖాస్తు ఫారాన్ని యువతీ యువకులకు అందజేశారు. తుగ్గలి తహశీల్దార్ కార్యా లయంలో మండలంలోని బిఎల్ఒలకు, వీఆర్వోలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 21 నుండి ఆగస్టు 21 వరకు బిఎల్ ఒలు ఇంటింటికి తిరిగి ఓటర్ కార్డు దరఖాస్తు, ఓటర్ కార్డ్ తప్పు ఒప్పులను పరిశీలిస్తారన్నారు. 18 సంవత్సరాల దాటిన యువకులు ఓటు హక్కును వినియోగించుకో వాలన్నారు. బిఎల్ఒలు ఇంటిదగ్గరకే రావడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఓటర్ల జాబితాలోని పేర్లను సరిచేసుకోవచ్చని అన్నారు. బిఎల్ఒలు ఈ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

## ఉల్చాల రోడ్డు జంక్షన్ పనుల పరిశీలన

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

మున్సిపల్ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ శనివారం ఉల్చాల రోడ్ జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మణిపూర్ మారణకాండపై నేడు జనకవనం

**ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్**

దేశంలో మతోన్మాదశక్తులు పెట్రేగి మారణకాండ సృష్టిస్తున్న విపత్కర పరిస్థితుల్లో మణిపూర్ అగ్నిగుండంగా మారి, దేశంలో మహిళలకు రక్షణలేకుండా మతోన్మాదులు అత్యాచారాలు, హత్యలు చేస్తున్నా పాలకులు చర్యలు తీసుకోకపోవడంపై కవులందరూ ఏకమై కవిత్వ నిరసన తెలియజేయనున్నామని సాహితీస్రవంతి జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు శ్రీనివాసమూర్తి ఆవులబసప్పలు శనివారం తెలిపారు. పాలకులే అగ్నికి ఆజ్యం పోస్తున్నారని, మణిపూర్‌లో నగ్నంగా ఊరేగించి హత్యలు చేసినా కేంద్రం నిమ్మకు నీరెత్తనట్లు ప్రవర్తిస్తుందని పేర్కొన్నారు. దేశం ప్రమాదంలో పడిన సందర్భంలో కవులందరం ఏకమై నిరసన వ్యక్తం చేయాల్సిన సందర్భం ఆసన్నమైందన్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు నగరంలోని సి.క్యాంపులోని లలితకళాసమితిలో ఆదివారం ఉదయం 10.00లకు మణిపూర్ మారణకాండపై జనకవనం నిర్వహిస్తున్నామన్నారు.స్వీయ కవితలతో కవులువచ్చి నిరసన వ్యక్తం చేయాలన్నారు. సాహిత్యాభిమానులు కళాకారులు, వివిధ ప్రగతిశీల సంఘాలు హాజరై ఈ నిరసన సభను జయప్రదం చేయాలని కోరారు.

# చిన్నారులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ

**డిఐఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

చిన్నారులు, బాలింతలు, గర్భవతుల ఆరోగ్యాన్ని వైద్య సిబ్బంది సంరక్షించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం కర్నూలు నగరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గడ్డ స్ట్రీట్ పరిధిలోని పెద్దపదకానా దండిగేరి సెక్రటేరియట్‌లో జరుగుచున్న టీకాల కార్య క్రమాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు సంబందించిన వ్యాక్సినేషన్ రికార్డులు, వ్యాక్సిన్ లు నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లా డుతూ ఎఎన్ఎంలు తమ పరిధిలోని అర్హులైన చిన్నపిల్లలందరికీ సమయాను సారంగా వ్యాక్సిన్లు యివ్వాలని, ముఖ్యంగా ఆర్ఒటి ఎంఆర్ వన్ఎంఆర్‌టు వ్యాక్సిన్లు 100 శాతం పూర్తిచేయాలని, గర్భవతులకు కాన్పుకు వెళ్ళవలసిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఎఎన్ఎం యాప్‌లో నమోదు చేయాలన్నారు. గర్భవతులలో ప్రమాదకర చిహ్నాలు గుర్తించి వారిని కాన్పు తేదీకి 3 రోజులు ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి సుఖ ప్రసవం అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. గర్భవతులకు ఐరన్ , కాల్షియం మాత్రలు జెఒఆర్ఎస్ పోకెట్స్ పంపిణీ చేసారు. ఆశా కార్యకర్తల దగ్గర 10 ప్రెగ్నెన్సీ కిట్లు తప్పకుండా ఉంచుకోవాలన్నారు. వాటిని అర్హులైన దంపతులను సందర్శించినప్పుడు వారికి పరీక్షలు చేయాలన్నారు. హెచ్‌బిఎన్ , సిహెచ్‌బివైసి, ఐఎఫ్ఎ సిరఫ్ , విఐటిఎ ద్రావణం సేవలకు సంబంధించిన డేటా వివరాలను ఆశా యాప్‌లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం సర్వేను తనిఖీ చేసి టీకాలు వేయించు కోవలసిన పిల్లలు , గర్భవతుల జాబితా తయారు చేసుకొని రాబోవు 3 నెలలో మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో టీకాలు అందించాలని తెలిపారు. యుపిహెచ్‌సి గడ్డస్ట్రీట్ వైద్యాధికారి డాక్టర్ అపర్ణ, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహా పాదయాత్రను జయప్రదం చేయాలి

**సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ మద్దతు**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ. పదివేల కోట్లు కేటాయించాలని సిపిఎం చేపట్టిన మహా పాదయాత్ర కోసం మద్దతుగా సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ మద్దతు ప్రకటించింది. ముందస్తుగా సివిల్ సప్లయ్స్ డిఎం వినతి పత్రం ఇచ్చారు. నాయకులు జి.బజారి అధ్యక్షతన సివిల్ సప్లయ్స్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ మాట్లాడుతూ నేటికీ కర్నూలు జిల్లా అభివృద్ధికి నోచుకోకుండా ఉందన్నారు. కర్నూలు నుంచి ప్రధానమంత్రి, రాష్ట్రపతి, కేంద్ర మంత్రులు .ముఖ్యమంత్రి అయినా కూడా సాగునీటి ప్రాజెక్టులు ,పరిశ్రమలు నిర్మించ లేదన్నారు. ప్రజలకు శాపంగా మారిన పాలకుల నిర్లక్ష్యాన్ని పోరాటాల ద్వారా పోగొట్టాలని అన్నారు. ఈ నెల 31న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. శీను, పరశురాములు, నాగరాజు, నారాయణ , రాజశేఖర్ పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ డిఎంకు వినతిపత్రం ఇస్తున్న కృష్ణ

కరపత్రాలు పంపిణీ చేస్తున్న మోటారు వర్కర్స్

**మోటారు వర్కర్స్ యూనియన్ కరపత్రాలు పంపిణీ**

కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఎం చేయనున్న మహాపాద యాత్రలో ప్రజలు తోడ్పాటు అందించి ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని బళ్లారి చౌరస్తా ఏరియాలో కర్నూలు జిల్లా మోటర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ చేశారు. మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.గంగాధర్, సభ్యులు సుధాకర్, రాజారెడ్డి, గాంధీ, కల్లూరు శేఖర్ పాల్గొన్నారు.

**కల్లూరులో రెండవ రోజు జీపు జాతా**

**కర్నూలు హాస్పిటల్:** కల్లూరు మండలంలో రెండో రోజు జీపుజాతా కార్యక్రమం దూపాడు గ్రామం నుంచి ఉలిందకొండ వరకు నిర్వహించారు. సిపిఎం మండల కార్యాదర్శి మధు మాట్లాడుతూ మండలంలో చిన్నరాయనతిప్ప రిజర్వాయరుకు నీళ్లు నింపి పంట కాలువలు ఏర్పాటు చేసి సాగునీరు అందించాలన్నారు. ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, హంద్రీనీవా కాలువ ద్వారా ఉలిందకొండ, చిన్నటేకూరు చెరువులకు నీళ్ల నింపాలన్నారు. మండలంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 31న కలెక్టరేట్ ముందు వేల మందితో నిర్వహించే ధర్నాకు ప్రజలు తరలి రావాలని కోరారు. పందిపాడు శీను, పెద్దపాడు గోపి, శివ, రాజు, పాండు హరిబాబు పాల్గొన్నారు.

జీపు జాతానుద్దేశించి మాట్లాడుతున్న మధు

## మొక్కల పెంపకం పై శ్రీ చైతన్య విద్యార్థుల అవగాహన ర్యాలీ

**ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్**

శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులతో శనివారం బుధవారపేటలోని వీధుల్లో మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించామని పాఠశాల ప్రధానాచార్యులు రాఘవ లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమం నాకు ముఖ్య అతిథులుగా శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎజిఎం సురేష్ ,ప్రాంతీయ బాధ్యులు వి.వెంకటేష్ ప్రారంభించారని ఆమె తెలిపారు. ఎజిఎం సురేష్ మాట్లాడుతూ తమ పాఠశాలల్లో ప్రతి నెలా సామాజిక బాధ్యతను గుర్తు చేసే కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరు చెట్లను పెంచి, మంచి గాలి, పరిశుభ్రమైన వాతావరణం మనకూ, మన తరువాతి తరానికి అందేలా కృషి చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు బుధవారపేట పురవీధుల్లో ప్లకార్డులు పట్టుకొని చెట్లు ప్రగతికి మెట్లని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ వీరయ్య ఆచారి, ప్రాథమిక బాధ్యులు రమ్య, ఉపాధ్యాయులు రంగస్వామి, ఇంద్రసేనారెడ్డి, ఖాదిర్, వీరేష్‌గౌడ్, మహేష్, భాస్కర్, మాలిక్, నిర్మల, నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

## రవీంద్ర మహిళా కళాశాలకు అరుదైన గుర్తింపు

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :** రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు 'లింక్డ్ ఇన్ సంస్థ' అరుదైన గుర్తింపునిచ్చింది. హైదరాబాదులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆ సంస్థ ట్రైనింగ్ , ప్లేస్మెంట్స్ కల్పించడంలో విశిష్ట కృషి చేసిన కళాశాలకు లీడర్స్ సమ్మేళనం అవార్డు కార్యక్రమంలో జ్ఞాపిక అందించారు. రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల గత కొద్ది సంవత్సరాలుగా విద్యార్థులకు శిక్షణ ఉపాధి కల్పనలో చేసిన కృషి వలన వారికి ఈ అవార్డు అందజేస్తున్నట్లు ఆ నిర్వహ కులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ కెఇ. శ్రీనివాసమూర్తి అవార్డును అందు కున్నారు. కళాశాల చైర్మన్ జివిఎం మోహన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. తమకళాశాలకు ఇంతటి గుర్తింపు లింకెడ్ ఇన్ సంస్థ నుంచి రావడం తమ బాధ్యత పెరిగిందన్నారు. కళాశాల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వై.పాండు రంగ య్య, అడ్మినిస్ట్రేటివ్ డీన్ డాక్టర్ ఎఎం. గిరిధర్ కుమార్లు అభినందనలు తెలిపారు.

## బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి : ఎంఇఒ

**ప్రజాశక్తి -సి బెళగల్**

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని అందుకు ఉపాధ్యాయులు సహకరించాలని ఎంఇఒ జ్యోతి, ఎంపిడిఒ రాముడు సూచించారు. శనివారం పరిషత్‌లో సమీక్షించి మాట్లాడారు. ముందుగా బడి బయట పిల్లలను గుర్తించాలన్నారు. ప్రతిఒక్కరు బాధ్యతగా బడిబయట ఉన్న పిల్లలను కూడా పాఠశాలలో చేర్పించాలని కోరారు. బడిఈడు పిల్లలను పనులలో పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యపై అవగాహన విస్తృతం చేయాలని కోరారు.

# 'తుంగభద్ర'లో 20 టిఎంసిల నీటి నిల్వ

**- రోజుకు 41,572 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో - అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు**
**- 28న ఎల్‌ఎల్‌సికి నీరు విడుదల చేసే అవకాశం**

**ప్రజాశక్తి - హోళగుంద**



కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం నీటి నిల్వ 20 టిఎంసిలకు చేరింది. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, చిత్రదుర్గ, బెళగావి, చిక్‌మంగళూరు తదితర ప్రాంతాల్లో గతవారం రోజులుగా అధిక వర్షాలు కురుస్తున్నాయి. టిబి డ్యాంకు రోజుకు ఇన్‌ఫ్లో 41,572 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. గత రెండు నెలలుగా వర్షాల్లేక డ్యాంకు వరద నీరు రాలేదు. ఈఏడాది ఎల్‌ఎల్‌సి కాలువ కింద సాగు ప్రశ్నార్థకమే అనుకున్న అన్నదాతలకు ప్రస్తుతం తుంగభద్ర డ్యాం వరద నీరు వచ్చి చేరతుండడంతో ఆశలు చిగురిస్తున్నాయి. ఈనెల 28న టిబి డ్యాం నుంచి ఎల్‌ఎల్‌సి కాలువకు సాగు, తాగునీటిని విడుదల చేసే అవకాశం ఉన్నట్లు విశ్వాసనీయ సమాచారం. లేకపోతే ఆగస్టు మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు తెలిసింది. గతేడాది జులై 23న తుంగభద్ర డ్యాంలో 80 టిఎంసిల నీటి నిల్వ ఉండేది.

**లక్ష ఎకరాల్లో వరి సాగు :** ఎల్‌ఎల్‌సి కాలువ కింద ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో లక్ష ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. ప్రస్తుతం రైతులు వరి నారు అంటించడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ ఏడాది మే, జూన్, జులై నెలలో వర్షాలు కురవకపోవడంతో తుంగభద్ర డ్యాంలో నీరు లేక రైతులు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద పెరుగుతోంది. మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయని అన్నదాతలు పేర్కొంటున్నారు.

## లాభాల బాటలో అవ్వ బ్యాంకు

**- బ్యాంకు చైర్మన్ రాయచోటి రామయ్య**

**ప్రజాశక్తి - ఆదోని**

సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

శ్రీమహాయోగి లక్ష్మమ్మ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ రూ.110 కోట్ల నికర లాభంతో ముందుకు సాగుతోందని బ్యాంకు చైర్మన్ రాయచోటి రామయ్య తెలిపారు. శనివారం బ్యాంకు వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.257 కోట్లు డిపాజిట్లు చేశారన్నారు. రూ.176 కోట్ల రుణాలు అందించి, 98 శాతం రుణాల వసూలుతో బ్యాంకు 'ఎ' క్లాస్ సర్టిఫికెట్ పొందడం ఆనందదాయకమని తెలిపారు. బ్యాంకు సిఇఒ గట్టు మురళీ కుమార్, మేనేజర్ జల్ఫికర్, బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సుబ్బయ్య, డైరెక్టర్లు లక్ష్మన్న శెట్టి, హుస్సేన్ అహ్మద్ పాల్గొన్నారు.

## తెర్నేకల్ హెచ్‌ఎంపై కలెక్టర్ ఆగ్రహం

**ప్రజాశక్తి - దేవనకొండ**

తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల స్థాయి అధికారులతో కలెక్టర్ డాక్టర్ సృజన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెర్నేకల్ గ్రామంలో 107 మంది బాల కార్మికులు అత్యధికంగా ఉన్నారని తెలిపారు. డిఇఒ రంగారెడ్డితో కలెక్టర్ మాట్లాడుతూ... ప్రధానోపాధ్యాయులును సస్పెండ్ చేయాలని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎంఇఒ తిమ్మారెడ్డిని ప్రశ్నించగా ఆగ్రహం వ్యక్తం చేసింది వాస్తవమేనని తెలిపారు.

## మణిపూర్ ఘటనలో దోషులను శిక్షించాలి

**- ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, ఐద్వా**

**ప్రజాశక్తి-ఆలూరు**

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి శేఖున్‌బీ మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో కుకి తెగకు చెందిన ముగ్గురు మహిళలను బహిరంగ ప్రదేశాల్లో నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘర్షణ వాతావరణాన్ని తొలగించి, శాంతి నెలకొల్పాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... మూడు నెలల నుంచి మణిపూర్‌లో మైతి, కుకి జాతుల మధ్యలో ఘర్షణ జరుగుతోందని తెలిపారు. ఆ ఘర్షణలను నిలువరించడంలో బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరన్ సింగ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజీనామా చేసి కుకిలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, డివైఎఫ్‌ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, మాజీ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినోద్, ఉమేష్ పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటే ఇదేనా..?

**- రోడ్ల దుస్థితిపై దృష్టి సారించండి**
**- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

అభివృద్ధి అంటే ఇదేనా..? అని, రోడ్ల దుస్థితిపై పాలకులు, అధికారులు దృష్టి సారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 32వ వార్డు ఈద్గా, పైమాలగేరి, 33వ వార్డు సంజీవ్ నగర్, 34వ వార్డు లక్ష్మణ్ పేట వీధుల్లో నియోజకవర్గం, పట్టణ సమగ్రాభివృద్ధి కోసం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు అనేక సమస్యలు పాదయాత్ర బృందం దృష్టికి తెచ్చారు. సిసి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, కొత్త సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి కుళాయిలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ స్తంభాలు తీగలు, ఈద్గా దగ్గర మురుగునీటి కాలువ మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు ఇవ్వాలని, ఇంటి స్థలాలు, టిట్కో ఇళ్ల పంపిణీ చేపట్టాలని కోరారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులను డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలందరినీ సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈనెల 26 నుంచి 31 వరకు సిపిఎం ఆధ్వర్యంలో మహా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. 31న జరిగే కలెక్టరేట్ ముట్టడిలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు లక్ష్మీ నరసయ్య, సిఐటియు నాయకులు రాముడు, చేనేత కార్మిక సంఘం నాయకులు కృష్ణ, సిపిఎం పట్టణ నాయకులు అబ్దుల్లా, రమేష్, రాజు, రాముడు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో సమస్యలు చూపుతున్న సిపిఎం నాయకులు

**కోసిగి :** జిల్లా సమగ్రాభివృద్ధి, కోసిగి మండల సమగ్రాభివృద్ధి కోరుతూ ఈనెల 26 నుంచి 31 వరకు చేపట్టే మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, సిపిఎం మండల కన్వీనర్ రాముడు కోరారు. శనివారం వందగల్లు, దుద్ది, కొలమాన్ పేట, ఆర్లబండ, కడిదొడ్డి, కామనదొడ్డి, కందుకూరు, అగసనూరు, సాతనూరు, చిర్తనకల్ తదితర గ్రామాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం నాయకులు రామకోటి హనుమంతు, ముకరన్న, నాగేంద్ర, ప్రకాష్, రాము, వీరేష్ పాల్గొన్నారు. **కౌతాళంలోని** అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు, సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య మాట్లాడారు. మండలంలో రోడ్లు సరిగా లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులు రావడం లేదని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతులందరికీ బీమా వర్తింపజేసేలా చూడాలని కోరారు. తాగునీరు లేక గ్రామాలు విలవిల్లాడుతున్నాయని, అధికారులు ముందుచూపు లేకపోవడంతో సమస్య ఏర్పడిందని తెలిపారు. మండల కన్వీనర్ వీరన్న, గిరప్ప, ఎల్లప్ప, వలీ పాల్గొన్నారు.

## ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

**- వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

వైసిపి పాలనలో ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని సుంకేశ్వరి, మాలపల్లి గ్రామాల్లో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. సంక్షేమ పథకం అందని గడప లేదన్నారు. ఎలాంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. పరిష్కారం కాని వాటి వివరాలను రాంపురం రెడ్డి సోదరుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఒ మణిమంజరి, సర్పంచి సీతారామిరెడ్డి, వికెసి రఘు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను అందజేస్తున్న భీమిరెడ్డి

## చేనేతలందరికీ నేతన్న నేస్తం

**- టిడిపి చేనేత నాయకులు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

చేనేతలందరికీ నేతన్న నేస్తం వర్తింపజేయాలని టిడిపి చేనేత నాయకులు మల్లికార్జున, మిన్నప్ప, దేవేంద్ర, కౌన్సిలర్ రాందాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి చేనేత కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో కేవలం 80,600 మంది చేనేతలకు మాత్రమే 'నేతన్న నేస్తం' విడుదల చేస్తూ చేనేతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తప్పుడు సంకేతాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 4 లక్షల కుటుంబాలకు పైగానే చేనేతలు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 6 వేల కుటుంబాలు చేనేత మగ్గంపై ఆధారపడి జీవిస్తుంటే కేవలం 1900 మందికే 'నేతన్న నేస్తం' వర్తింపజేయడం దారుణమని విమర్శించారు. వెంటనే 'నేతన్న నేస్తం'ను చేనేతలందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు పట్టణ చేనేత నాయకులు బిజ్జె నాగరాజు, డిసి.నరసింహులు, నజీర్, మహేష్, ఈరన్న, కృష్ణ, రాజు, సోమన్న, శ్రీనివాసులు, మిన్నెల్లా, పులికొండ, ఉరుకుందు, సోడా శ్రీనివాసులు, బండా నరసప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి చేనేత నాయకులు

# బాబుకు వాలంటీరుగా పవన్

**- ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి**
**- ఆదోనిలో 'జగనన్న సురక్ష'**

**ప్రజాశక్తి - ఆదోని**

రాష్ట్రంలోని ప్రజల కోసం పని చేస్తున్న వాలంటీర్లను అనేక రకాల విమర్శిస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ టిడిపి అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని వాలంటీరుగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి విమర్శించారు. శనివారం పట్టణంలోని రాయనగర్‌లో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. అర్హులైన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పవన్ కల్యాణ్ సినిమాలో నటిస్తూ రాజకీయాల్లోకి వచ్చారని, సినిమాలో నటించే వారిని ప్రజలు నమ్మరని తెలిపారు. ప్రజల కోసమే పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారని వివరించారు. సినిమాల్లో నటిస్తున్న పవన్ కల్యాణ్ పార్ట్ టైం మాదిరిగా రాజకీయాలు చేస్తున్నారని, ఆయన వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగమూ లేదని తెలిపారు. సినిమా యాక్టర్లను రాజకీయాల్లో నమ్మే పరిస్థితి, కీర్తిశేషులు ఎన్‌టిఆర్‌తోనే అది ముగిసిందని చెప్పారు. ఆయన పార్టీ పెట్టి 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారని, మరో నటుడు చిరంజీవి పార్టీ పెట్టి నడపలేక కాంగ్రెస్‌లో విలీనం చేశారని తెలిపారు. అదే పరిస్థితి పవన్ కల్యాణ్ పడుతుందన్నారు. ఆచరణకు సాధ్యం కానీ హామీలను చంద్రబాబు ఇస్తున్నారని, బస్సుల్లో అందరికీ ఉచితమని చెప్పి ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం తలలు పట్టుకుందని తెలిపారు. తిరిగి రాష్ట్రంలోనూ అదే పరిస్థితి నెలకొంటే ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంకగా మారుతుందని చెప్పారు. ప్రజల కోసం పని చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ శాంత, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వైసిపి నాయకులు చంద్రకాంత్ రెడ్డి, రామలింగేశ్వర యాదవ్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

**షాదీఖానా పనులు పూర్తి చేస్తాం :** పట్టణంలో మహ్మద్ అలీ పార్కులో ముస్లిం, మైనారిటీల సంక్షేమానికి నిర్మిస్తున్న షాదీఖానా పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. షాదీఖానా పనులకు రూ.20 లక్షల చెక్కును ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి చేతికి జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబియా బేగం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిలిచిపోయిన పనులను ప్రారంభించడానికి రూ.20 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా మంజూరు చేసిందని తెలిపారు. ఇంకా రావాల్సిన రూ.కోటి త్వరలో వస్తాయని చెప్పారు. త్వరగా షాదీఖానా నిర్మాణ పనులను పూర్తి చేయించి తనవంతుగా అన్ని ప్రయత్నాలు చేస్తానని తెలిపారు. ఎపి స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్‌ఎంబి.అన్సర్ ఉర్ఫ్ అన్ను, వక్ఫ్ బోర్డ్ జిల్లా చైర్మన్ నియాజ్ అహ్మద్, మార్కెట్ యార్డు చైర్మన్ మజహర్ అహ్మద్, పట్టణం ఖతిబ్ జునైద్ హాష్మి, వైసిపి ముస్లిం మైనారిటీ నాయకులు సయ్యద్ అమాన్, బస్టాండ్ బాషు సాబ్, అబ్దుల్ రహీం, జుబేర్ అహ్మద్ పాల్గొన్నారు.

## క్యూరింగ్ చేస్తుండగా... విరిగిన ప్రధానోపాధ్యాయుని చేయి

**ప్రజాశక్తి - మంత్రాలయం**

నాడు-నేడు కింద పాఠశాల నిర్మాణంలో క్యూరింగ్ చేస్తుండగా ప్రధానోపాధ్యాయులు గురుస్వామి కింద పడి చేయి విరిగిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. మండలంలోని సూగూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పి.గురుస్వామి గ్రామంలో నాడు-నేడు పథకం కింద మంజూరైన పాఠశాలకు పైభాగంలో నీటిని తరలించి క్యూరింగ్ చేస్తుండగా బండపై ఉన్న కాలు జారి కింద పడగా చేయి విరిగింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ఉపాధ్యాయులకు ఇలాంటి పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. గాయపడిన గురుస్వామిని యుటిఎఫ్ నాయకులు రవికుమార్, విజయ్ కుమార్, పాండు రంగారెడ్డి పరామర్శించారు.

## వైఎస్‌ఆర్ బీమా నగదు పంపిణీ

**ప్రజాశక్తి - పెద్దకడబూరు**

మండలంలోని కల్లుకుంట గ్రామంలో ఉప్పర ఈరమ్మ (23) గతవారం క్రితం మృతి చెందారు. శనివారం వైఎస్‌ఆర్ బీమా కింద రూ.10 వేల నగదు వెల్ఫేర్ అసిస్టెంట్ మహాదేవి, మాజీ సర్పంచి ఈడిగ మహేశ్వరి, వాలంటీరు రాణి మృతురాలి తండ్రి ఉప్పర నరసింహులుకు అందజేశారు. మిగతా రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని తెలిపారు.

## పింఛను ఇప్పించండయ్యా..!

**- ఓ వృద్ధురాలి విన్నపం**

**ప్రజాశక్తి - ఆస్పరి**

అర్హత ఉన్నా పింఛను రావడం లేదని, పింఛను ఇప్పించాలని మండలంలోని తంగరడోన గ్రామానికి చెందిన వృద్ధురాలు ఆకుల జయరబీ కోరారు. శనివారం 'జగన్న సురక్ష'కు హాజరయిన మండల అధికారులను ఆమె వేడుకున్నారు. గతంలో తన భర్తకు వృద్ధాప్య పింఛను పింఛను వచ్చేదని, ఆయన మృతి చెంది సంవత్సర కాలం దాటినా నేటికి తనకు పింఛను రావడం లేదని తెలిపారు. తనకు కొడుకులు లేరని, అధికారులు స్పందించి పింఛను మంజూరు చేయాలని కోరారు.

## పచ్చని చెట్లే మానవాళికి రక్షణ

**- కళాశాల ప్రిన్సిపల్ సుబ్రమణ్యం**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

పచ్చని చెట్లే మానవాళికి రక్షణ అని కళాశాల ప్రిన్సిపల్ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం చిప్పగిరి జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని తెలిపారు. మానవుని ఆరోగ్యానికి చెట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చెట్లు కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకొని మానవుని ప్రాణవాయువైన ఆక్సిజన్ వదులుతాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి వాతావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలను నాటినట్లు తెలిపారు. కళాశాల అధ్యాపకులు రఫీ, సుధీర్, శ్రీనివాసులు, ఓబులేసు, విద్యార్థులు గుమ్మనూరు రమేష్, మనోజ్, మల్లి, మధు పాల్గొన్నారు.

## వార్డు అభివృద్ధికి కృషి

**- మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు**

**ప్రజాశక్తి - ఆదోని**

మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి నరసింహులు తెలిపారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో అరుణ్‌జ్యోతి నగర్‌లో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జీ జయమనోజ్ రెడ్డి సహకారంతో వార్డులోని మురుగు కాలువలు, రోడ్లు వేయిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం మరుగుదొడ్ల సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అర్హులైన వారందరికీ నిర్మాణం జరిగేలా సహకరిస్తామన్నారు. ఆదాయ, కుల, జనన, మరణ, బియ్యం కార్డు, ఇతర సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించడమే 'జగనన్న సురక్ష' ఉద్దేశమని వివరించారు.

## ఇలా ఉంటే నీరు కలుషితం కాదా..?

**ప్రజాశక్తి - ఆదోని**

తాగునీరు కలుషితమైతే, ఆ నీటిని తాగిన వారు డయేరియా బారినపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. నీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. నీరు కలుషితమవుతున్నా పట్టించుకోని పరిస్థితులు ఉన్నాయని పట్టణవాసులు వాపోతున్నారు. పట్టణంలోని బిఎన్ టాకీసు వెనుక ఉన్న రోడ్డులో డోర్ నెంబర్ 19/234 దగ్గర ప్రయివేట్ పైపులైన్ లీకేజీ అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నీరు కలుషితం కాకుండా చూడాలని స్థానికులు నీటి సరఫరా విభాగం సిబ్బందికి తెలిపినా పెడచెవిన పెడుతున్నారని చెబుతున్నారు. ఇక్కడ కొన్ని ప్రయివేట్ కుళాయిలను గతంలో పూర్తిగా తొలగించకుండా కాలువ మధ్యలోనే కేవలం బన్ ప్లగ్ వేసి వదిలేయడంతో ఈ సమస్య ఏర్పడిందని పేర్కొంటున్నారు. ఏడాది క్రితమే లైన్‌మేన్‌కు చెప్పినా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం లీకేజీ పెరిగి ఇతర కుళాయి పైపులైన్లలో కలుషిత నీరు వచ్చే ప్రమాదం ఏర్పడిందన్నారు. కమిషనర్ రఘునాథ్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

**- జనసేన జిల్లా నాయకులు చల్లా వరుణ్**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని జనసేన జిల్లా నాయకులు చల్లా వరుణ్ తెలిపారు. శనివారం జనసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంకటగిరిలో ముఖ్యమంత్రి జగన్ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వాలంటీర్ల అకృత్యాలను ఆధారాలతో నిరూపిస్తే వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దాడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. సభలో చేనేతలకు ఎంతవరకు మేలు చేశాం, భవిష్యత్తులో ఎంత మేలు చేస్తామనేది తెలుపకుండా పవన్‌పై దూషణలు చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు.

# ప్రజల చెంతకే పరిపాలన : ఎంపిపి

**ప్రజాశక్తి - ఆస్పరి**

ప్రజల వద్దకే పరిపాలన అందిస్తున్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష' నిర్వహిస్తున్నామని ఎంపిపి ఉమాదేవి తెలిపారు. శనివారం మండలంలోని శంకరబండ, తంగరడోన సర్పంచులు జయలక్ష్మి, శంకరమ్మ, నాగలక్ష్మి, ఎంపిడిఒ రాణెమ్మ, తహశీల్దార్ కుమారస్వామి ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి సర్వీస్ ఫీజు లేకుండా ఉచితంగా పొందే అవకాశం ప్రభుత్వం ప్రజలకు కల్పిస్తోందని తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా ఇప్పటి వరకు తంగరడోనలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు మొత్తం 264 మందికి, శంకరబండలో 156 మందికి పంపిణీ చేశామన్నారు. ఇఒఆర్‌డి నరసింహా రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ గాయత్రి, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, కో కన్వీనర్ పురుషోత్తంరెడ్డి, మండల మాజీ కన్వీనర్ రామాంజినేయులు, ఎంపిటిసి తిమ్మప్ప, విఆర్ఒ శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మన్న, వీరేష్, వైసిపి నాయకులు రాజన్న, రంగన్న, దస్తగిరి, పాండు, మునిస్వామి, రంగముని పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపిపి ఉమాదేవి

## మణిపూర్ ఘటన దేశానికే సిగ్గు చేటు

**- అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ కన్వీనర్ శేషం ప్రభాకర్**

**ప్రజాశక్తి - ఆదోని**

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాదులు

ఇటీవల మణిపూర్‌లో జరిగిన స్త్రీల నగ్న ప్రదర్శన సంఘటన దేశానికే సిగ్గుచేటని అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ (ఎఎఎఫ్) కన్వీనర్ శేషం ప్రభాకర్ తెలిపారు. శనివారం ఎఆర్‌పిఇ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టపగలే నడిరోడ్డుపై మహిళలను నగ్నంగా ఊరేగించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి ఘటనకు కారకులైన వారిపై చట్టరీత్యా శిక్షలు విధించి ఉరితీయాలన్నారు. మణిపూర్ ప్రభుత్వం, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంతోనే ఇలాంటి సంఘటన జరిగిందన్నారు. 357 చర్చీలను ధ్వంసం చేసి, 150 మంది పాస్టర్లను తరిమి కొట్టడం దారుణమన్నారు. కేవలం క్రిష్టియన్లను అక్కడి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని ఇలాంటి ఘటనలకు పాల్పడడం బాధాకరమని బార్ అసోషియన్ నాయకులు, సీనియర్ న్యాయవాది డాక్టర్ హెచ్.అంజనప్ప, ఎపిజి ఎస్.అంజినేయులు తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**పెద్దకడబూరు :** పెద్దకడబూరు మజరా గ్రామమైన బాపురంలో మృతి చెందిన ఉప్పర పద్మావతి (45) కుటుంబానికి వైసిపి నాయకులు ఆర్థిక సహాయం అదజేశారు. పద్మావతి శనివారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి నాయకులు హనుమంతు రెడ్డి, తెలుగు చిన్న వీరేష్, బసిరెడ్డి, రాఘవరెడ్డి, హుస్సేని పద్మావతి కుమారుడు భీమాకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

# నిబంధనలు పాటించని విత్తన దుకాణాలపై చర్యలు

**- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు నిర్వహించే విత్తన దుకాణాలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ హెచ్చరించారు. శనివారం గోనెగండ్లలో పలు విత్తన షాపులను జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ వెంకటేశ్వర్లు, ఎఒ శశిధర్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. హెచ్.కైరవాడి గ్రామంలోని వైష్ణవి ట్రేడర్స్‌తో పాటు గోనెగండ్లలోని ధరణి ఏజెన్సీస్, బడేసావలీ, ముబారక్, వేదశ్రీ ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డీలర్లు అందరూ ఫారం-సితో పాటు సోర్స్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉంచుకోవాలని తెలిపారు. ధరల పట్టికను రోజూ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ప్రతి రైతుకూ బిల్లు ఇవ్వడంతో పాటు బిల్లుపై తప్పనిసరిగా రైతు సంతకం తీసుకోవాలని తెలిపారు. ఎంఆర్‌పి ధరల కంటే అధిక ధరలకు విక్రయించరాదని, ప్రతినెలా 5లోపు క్రయవిక్రయాలకు సంబంధించిన వివరాలను వ్యవసాయ శాఖ కార్యాలయంలో తెలియజేయాలని చెప్పారు.

గోనెగండ్లలో షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు

**పెద్దకడబూరు :** రైతులకు పురుగు మందులు విక్రయించినప్పుడు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని వ్యవసాయాధికారులు తెలిపారు. శనివారం మండలంలోని వివిధ పురుగు మందుల దుకాణాల్లో జిల్లా స్క్వాడ్ బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు కె.సంధ్యారాణి, వ్యవసాయాధికారి ఎన్.రామకృష్ణ, ఎఒ ఎం.వరప్రసాద్ మాట్లాడారు. అన్ని దుకాణ యజమానులు రిజిస్టర్లు, బిల్లు బుక్కులు రోజూ రాసుకోవాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం నిర్వహించే దుకాణాలను మూసేస్తామని హెచ్చరించారు. ఎమ్మిగనూరు సాయి బాలాజీ ట్రేడర్స్ నుంచి వచ్చిన వివిధ రకాల నకిలీ పురుగుమందులను గుర్తించి రూ.3.9 లక్షల విలువ చేసే పురుగు మందుల అమ్మకాలను నిలిపేసినట్లు తెలిపారు.

## ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించండి : తహశీల్దార్

**ప్రజాశక్తి - చిప్పగిరి**

ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న ఓటరు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఓటరు సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామంలోని వాలంటీరు ఈ సర్వేలో పాల్గొనకుండా చూసుకునే బాధ్యత బిఎల్ఒలదేనని చెప్పారు. ప్రతి ఇంట్లో సర్వే చేసి 18 ఏళ్లు నిండిన వారుంటే వారికి సంబంధించిన ఆధార్ జిరాక్స్ కాపీ తీసుకొని ఫారం-5లో నమోదు చేయాలని తెలిపారు. మార్పులు, చేర్పులు ఉంటే సంబంధిత ఫారంలో నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో ఒకరి ఫొటో డబుల్ ఉంటే ఒకటి మాత్రం తప్పనిసరిగా తీసేయాలన్నారు. సర్వే నిర్వహించే ప్రతి అధికారీ సాయంత్రం 4 గంటల సమయానికి ఎన్ని ఇళ్లు సర్వే చేశారో వాటి వివరాలన్నీ రెవెన్యూ కార్యాలయానికి తెలియజేయాలని అన్నారు. డిటి గుండాల నాయక్ పాల్గొన్నారు.

**దేవనకొండ :** ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటరు సర్వేను నిష్పక్షపాతంగా చేపట్టాలని తహశీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఒలతో ఓటరు సర్వేపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఉన్న వాలంటీర్లు ఓటరు సర్వేలో పాల్గొనకుండా చూసుకోవాలన్నారు.

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్**

నవోదయ 11వ తరగతి లేటరల్ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. 2023-24 విద్యా సంవత్సరానికి గాను నవోదయ విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశం కోసం, 11వ తరగతిలో లేటరల్ ప్రవేశ పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించారు. ఈ పరీక్ష రెండు పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 921 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 151 మంది పరీక్షకు హాజరయ్యారని జవహర్ నవోదయ ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ కె.చందిరన్ తెలిపారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సమన్స్ వాయిదా ప్రకటన
మహారాజశ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No. 294/2022
కె. వెంకటేశ్వర్లు .... వాది
Vs
D1. V. రాజగోపాలాచార్యులు, S/o. వెంకటేశ్వర చార్యులు, Govt. Teacher
D2. M. గోవిందు, S/o. పెద్దలింగన్న, Govt. Teacher
Both are working in క్రిష్ణాపురం Z.P. హైస్కూలు, వెల్దుర్తి మండలం, కర్నూలు జిల్లా.
... ప్రతివాదులు
పై నెంబర్ దావాలోని D1,D2 ప్రతివాదులపై వారి దావా మొత్తం రాగోరి దావా దాఖలు చేయగా కోర్టు వారు ఎన్ని సార్లు సమన్లు పంపగా మీరు తీసుకోవడం లేదు కావున వాది అయిన సమన్లు చేరవేయుటకు పత్రికాముఖముగా కోర్టు వారు ఆర్డర్ చేసియున్నారు వాయిదా తేదీ : 25-8-2023 ఉన్నది. కావున సదరు ప్రతివాదులు 25-08-2023 వ తేదీన ఉదయం 10-30 గంటలకు మీరు కాని మీ వకీలు ద్వార గాని ఆక్షేపణలుయుంటే తెలుపుకోగలరు లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ : 25-08-2023
కె. గోపాల్, M.A. LLB
వాది యొక్క అడ్వకేట్
డోన్, నంద్యాల జిల్లా.



# మహా పాదయాత్రకు సన్నద్ధం

**ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి**

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈ నెల 26 నుంచి 31 వరకు కర్నూలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే మహా పాదయాత్ర కోసం సిపిఎం ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా కర్నూలు నగరంలో ఇంటింటికి తిరిగి సిపిఎం బృందాలు సమస్యలను సేకరిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో సమావేశాలు, సభలు నిర్వహించి మహాపాదయాత్ర ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరింది. జిల్లా కేంద్రం నుంచి రాజధాని అమరావతికి రోడ్డు, రైలు మార్గాలు వేసి, కర్నూలు నుంచి అమరావతికి రెగ్యులర్ రైలు నడపాలన్నారు. రైల్వే వ్యాగన్ వర్క్ షాప్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదోని, ఎమ్మిగనూరులలో టెక్స్‌టైల్ పార్కులను నిర్మించాలన్నారు. సమస్యల పరిష్కారానికి సిపిఎం దశలవారీ ఆందోళనల్లో భాగంగా ఈనెల 10 వరకు గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. రెండో దశలో 11, 12, 13న కరపత్రాలు వేసి అన్ని నియోజకవర్గాలలో ఆరుజీపు జాతాల ద్వారా ప్రచారం చేపట్టారు. పాదయాత్ర ఈ నెల 26న ఆదోనిలో ప్రారంభం కానుంది. ప్రారంభ సభకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ హాజరు కానున్నారు. 31న నిర్వహించే మహా ధర్నా, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు హాజరు కానున్నారు.

**సాగుపై ఆశలు..**

ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల ఒక మోస్తారు వర్షం కురిసింది. రైతుల్లో సాగుపై ఆశలు చిగురించాయి. జిల్లాలో విత్తన సాగు కనీసం 20 శాతం కూడా పూర్తి కాలేదు. బావుల కింద, బోర్ల కింద అక్కడక్కడ సాగు జరిగింది. వర్షాధార పంటలు కొన్ని చోట్ల సాగు జరిగినా వర్షాభావ పరిస్థితుల వల్ల మొలకెత్తిన పంట కూడా వాడుముఖం పట్టాయి. కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, కల్లూరు, ఓర్వకల్ తదితర మండలలతో పాటు కొన్ని చోట్ల మోస్తరు వర్షపాతం నమోదయింది. కర్నూలు నగరంలో భారీ వర్షం కురిసింది. నగరంలోని చాలా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. కొన్ని మండలాల్లో వర్షం కురవడంతో రైతులు విత్తనానికి సిద్ధమయ్యారు. జూన్ నుండి సరైన వర్షపాతం లేనందున విత్తనానికి పదును లేకపోవడం వల్ల విత్తనసాగు జరగలేదు. వర్షం పడటం వల్ల విత్తనానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికీ వర్షం కురవకపోవడం వల్ల పంటలు ఆలస్యం అయ్యాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేటి నుండి అయినా వర్షం కురిస్తే విత్తనానికి సానుకూలంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. సరైన సమయంలో విత్తనం సాగు కాకుంటే దిగుబడులు కూడా అంతంత మాత్రం వస్తాయని, రాష్ట్రంలో అత్యల్ప వర్షపాతం నమోదయిన జిల్లాలో కర్నూలు జిల్లా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆశాల ఆందోళన**

తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. కర్నూలు, నంద్యాలలో డిఎంహెచ్ఒ కార్యాలయ ముట్టడి నిర్వహించారు. ఆశాల సమస్యలు పరిష్కరించి తీరాలని పట్టుబట్టారు. డిఎంహెచ్ఒలకు వినతి పత్రాలు సమర్పించారు.

# 2 వేల విద్యా వాలంటీర్ల పోస్టులు భర్తీ

- పెండింగ్ గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి
- ఉర్దూ వర్సిటీ పనులు చేపడతాం
- జడ్‌పి సమావేశంలో మంత్రులు అంజాద్ బాష, గుమ్మనూరు జయరాం
- కర్నూలు డిఇఒపై ఎమ్మెల్యే రామిరెడ్డి ఆగ్రహం
- సిపిడబ్ల్యు స్కీంల మరమ్మతులు ప్రభుత్వమే భరించాలి : జడ్‌పిటిసిలు

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనేక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో తాత్కాలికంగా 2000 విద్యా వాలంటీర్ల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రకటించారు. జడ్‌పి నిధులనుండే విద్యా వాలంటీర్లకు నెలకురు రూ.10000 గౌరవ వేతనంగా చెల్లించేందుకు అంగీకరిస్తూ తీర్మానం చేసి పంపామని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జగనన్న కాలనీలో చేపడుతున్న గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. నంద్యాల జిల్లా ఇన్చార్జి మంత్రి , ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన, జిల్లా పరిషత్ సిఇఒ నాసర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళంగా నిర్వహించారని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కర్నూలు డిఇఒ వెంకట రంగారెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉర్దూ బోధించే ఉపాధ్యాయురాలని ఇంగ్లీష్ బోధించాలని బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అడ్డగోలుగా ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించారని డిఇఒపై మండి పడ్డారు. వెంటనే బదిలీలను నిలిపి వేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లాలో చేపడుతున్న పంటల బీమాలో రైతులకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఎమ్మెల్సీ రాజగోపాల్ రెడ్డి మంత్రుల దృష్టికి తెచ్చారు. వైఎస్ఆర్ పంటల బీమా గా పేరు మార్చారు కానీ రైతులకు మాత్రం ఈ పథకం లబ్ది చేరడం లేదన్నారు.

నాడు నేడు ద్వారా జరుగుతున్న పనులకు బిల్లుల సరిగా మంజూరు కావడం లేదని జడ్‌పిటిసిలు ప్రస్తావించారు. బిల్లులను త్వరగా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రుల దృష్టికి తెచ్చారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించి నిధులను సరిగా ప్రభుత్వం విడుదల చేయడం లేదని జడ్‌పిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిడబ్ల్యు స్కీమ్స్ పర్యవేక్షణకు జడ్‌పి నిధులను వాడటం సరైనది కాదని జడ్‌పిటిసిలు మంత్రుల దృష్టికి తెచ్చారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే నిధులను భరించేలా సిఫార్సు చేయాలని మంత్రులు జడ్‌పి చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఉర్దూ యూనివర్సిటీ పనులు మధ్యలోనే ఆగిపోయాయని మంత్రుల దృష్టికి ఓర్వకల్ జడ్పిటిసి తీసుకువచ్చారు. ఇక్కడ పనులను త్వరగా పూర్తిచేస్తే మైనారిటీలకు ఉర్దూ విద్యాబోధనకు ఇబ్బంది ఉండదని అన్నారు. జిల్లా పరిషత్‌లోని అతిథి గృహంలో వెంటనే మరమ్మతులు చేపట్టి జడ్పిటిసి సభ్యులకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి మహిళా జడ్‌పిటిసిలకు ప్రత్యేకంగా వసతి కల్పించాలని కోరారు.

**ఉర్దూ యూనివర్సిటీపై సిఎం ప్రత్యేక దష్టి : మంత్రులు**

సమావేశం అనంతరం మీడియాతో మంత్రులు అంజాద్‌బాష, గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి ఉర్దూ వర్సిటీ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని అన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి నిధులను కూడా విడుదల చేయాలని శాఖ అధికారులను ఆదేశించా రన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నాడు నేడు కింద చేపడుతున్న పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించా మన్నారు. ఇప్పటివరకు పెండింగులో ఉన్న గృహాలను త్వరగా పూర్తిచేసేలా చూడాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. జడ్‌పి చైర్మన్ సమావేశంలో చేసిన తీర్మానాలను వెల్లడించారు. కెజిబివి పాఠశాలల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేలా అనుమతించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉన్న నేపథ్యంలో విద్యా వాలంటీర్ల నియామకాలకు అనుమతించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నమన్నారు. జిల్లాలో సిపిడబ్ల్యు స్కీం పథకాల నిర్వహణకు అవసరమయ్యే నిధులను ప్రభుత్వమే భరించాలని కోరామన్నారు. త్వరలో ఐఎబి సమావేశంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, టి.ఆర్థర్, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, డాక్టర్ జె.సుధాకర్, ఎమ్మెల్సీ మధుసూదన్, జడ్‌పి వైస్ చైర్మన్లు, జడ్పిటిసి సభ్యులు, ఎంపిపిలు, కర్నూలు, నంద్యాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రధాని, కేంద్ర హోం మంత్రి, మణిపూర్ సిఎంలు రాజీనామా చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

**ప్రజాశక్తి - నంద్యాల**

మణిపూర్ ప్రజలకు, దేశంలోని మహిళలకు ప్రధానమంత్రి క్షమాపణలు చెప్పాలని, లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేయడంలో విఫలమైన వారి డబల్ ఇంజన్ ప్రభుత్వంకు బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి, కేంద్ర హోంమంత్రి, మణిపూర్ సిఎంలు వెంటనే రాజీనామా చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. శనివారం నంద్యాలలోని జమాతే ఇస్లామి కార్యాలయంలో ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక కన్వీనర్ ఎస్ఎండి అబులైస్ అధ్యక్షతన ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వ హించారు. మణిపూర్‌లో క్రైస్తవులపై, మహిళలపై జరుగుతున్న అమానవీయ చర్యలను ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మూడు నెలల నుండి మణిపూర్‌లో 249 చర్చిలు, 17 దేవాలయాలు, పలు విద్యాసంస్థలు, వేల ఇల్లు, జాతుల వైరుధ్యం వల్ల నేలమట్టం అయ్యాయని, 120 మంది పౌరులు మరణించినా, అన్ని ప్రభుత్వ వ్యవస్థలు అచేతనమై ఆఖరికి సుప్రీం కోర్టు, 'మీరు చర్యలు తీసుకుంటారా లేక మమ్మల్ని చర్యలు తీసుకోమంటారా?' అని కోప్పడే వరకు ప్రధానమంత్రి మౌనం వీడలేదన్నారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన వార్తాపత్రికల్లో మణిపూర్ అఘాయిత్యాల గురించి మొదటి పేజీలో వచ్చే వరకు ప్రధాని, కేంద్ర హోంమంత్రి, మణిపూర్ సిఎం ఏమీ జరగనట్లు బయట ప్రపంచానికి ఏమీ తెలియకూడదనే (మిగతా 6వ పేజీలో...)

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు అబులైస్

# కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్

**ప్రజాశక్తి - నంద్యాల**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం నంద్యాల పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయం టి.నరసింహయ్య భవన్‌లో సిఐటియు జిల్లా నిర్మాణ వర్క్ షాప్ జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం అధ్యక్షతన జరిగింది. ఈ వర్క్ షాప్‌నకు ముఖ్యఅతిథులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ మతోన్మాదాన్ని ఉపయోగించుకొని అధికారంలోకి వచ్చిందని అన్నారు. మతం పేరుతో కార్మికులను, ప్రజలను విడదీసే విధంగా బిజెపి విధానాలు ఉన్నాయని తెలిపారు. భారతదేశంలో కార్మిక హక్కులు కుదించబడుతున్నాయని, కార్మికులను విచ్ఛిన్నం చేస్తూ కార్మికుల, ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బానిసత్వం పోవాలంటే పోరాటమే శరణ్యమన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు సివిల్ కోడ్‌లుగా విభజించి కార్మికులను యాజమాన్యాలకు కట్టు బానిసల్లాగా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు ఐక్య ఉద్యమాలు నిర్వహించి బిజెపి మతోన్మాద పార్టీని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని అన్నారు. బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ నిధి డబ్బులు వాడుకొని రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది యాక్సిడెంట్ బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని, వాడుకున్న నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ స్కీంలలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. హమాలీ, ఆటో ఇతర రంగాల కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని తెలిపారు. ఈ రోజు రేపు జరగబోయే సిఐటియు జిల్లా వర్క్ షాప్‌లో చర్చించుకుని భవిష్యత్తులో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు ఉదతం చేపడతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య, టి.మద్దులు, కెఎండి.గౌస్, భాస్కర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు వి.బాల వెంకట్, వెంకట్ లింగం, నాగమణి, జిల్లా కోశాధికారి తిరుపతయ్య, జిల్లా నాయకులు రత్నమయ్య, మారెన్న సోమన్న, భాస్కర్, భారతి, మండల కార్యదర్శి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## నిరాశ్రయులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

పట్టణంలోని సద్దాం కాలనీలో ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు వసతి గృహం నిర్వాహకుడు ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ అడ్వకేట్ అసోసియేషన్ తరపున శనివారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడ్వకేట్లు మాట్లాడుతూ నిరాశ్రయులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేయడం తమకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. భవిష్యత్తులో న్యాయవాదులందరం కలిసి అనాథలకు ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ అడ్వకేట్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు రమణయ్య, ఉపాధ్యక్షులు మురళీధర్ గౌడ్, సెక్రటరీ శివప్రసాదరావు, కోశాధికారి తిరుపాల్ రెడ్డి, సభ్యులు ఖాజా హుస్సేన్, వెంకటసుబ్బయ్య, సుబ్బయ్య, రఘురామిరెడ్డి, షఫ్రక్, చందన, లత, తోట నరసయ్య, పుత్త మురళి బాబు, జాకీర్ (గోల్డ్), అజయ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ డిఇఇగా రవికాంత్ చౌదరి

**ప్రజాశక్తి, ఆళ్లగడ్డ**

ఆళ్లగడ్డ విద్యుత్ డిఇఇగా రవికాంత్ చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల నుంచి ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. గతంలో డిఇఇగా ఉన్న సుబ్రహ్మణ్యం నంద్యాల ఎస్పిఎంకు బదిలీ అయ్యారు. రవికాంత్ చౌదరి గతంలో ఆళ్లగడ్డ మండల విద్యుత్ ఏఈగా పని చేశారు. దీనికి తోడు రవికాంత్ చౌదరి ఆళ్లగడ్డ ఏరియా వాసి కావడం, మళ్లీ డిఇఇగా బదిలీపై రావడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. బాధ్యతలు స్వీకరించిన రవికాంత్ చౌదరిని నియోజక వర్గంలోని మండలాల ఏఈలు, విద్యుత్ సిబ్బంది అభినందించారు. నూతన డిఇఇ మాట్లాడుతూ వినియోగదారులకు ఏ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

# మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వార్డుబాయ్

- బంధువులతో కలిసి మహిళ వైద్యశాల ముందు ధర్నా

**ప్రజాశక్తి - బనగానపల్లె**

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న వార్డు బాయ్ శుక్రవారం రాత్రి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో మహిళ బంధువులతో కలిసి శనివారం ప్రభుత్వ వైద్యశాల గేటు ముందు ఆందోళన చేపట్టారు. వార్డు బాయ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన దేవి మాట్లాడుతూ శుక్రవారం తన కుమారుడు యశ్వంత్‌కు వాంతులు, విరేచనాలు కావడంతో చికిత్స నిమిత్తం వైద్యశాలలో చేరామన్నారు. రాత్రి 10 గంటల సమయంలో పంటి నొప్పి రావడంతో డాక్టర్‌ను అడిగి టాబ్లెట్లు వేసుకుని, నిద్ర పట్టకపోవడంతో రాత్రి 11 గంటల సమయంలో వైద్యశాల లోపల తిరుగుతుండగా వార్డు బాయ్ వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతకు వార్డు బాయ్‌పై ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. గతంలో కూడా వైద్యశాలకు వచ్చిన మహిళల పట్ల వార్డు బాయ్ అసభ్యంగా ప్రవర్తించారన్నారు.

ప్రభుత్వ వైద్యశాల ముందు బంధువులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న బాధిత మహిళ

**వైద్యశాల సూపరింటెండెంట్ వివరణ :** ప్రభుత్వ వైద్యశాలలో మహిళ పట్ల జిఎడి అరబ్ జాన్ అసభ్యంగా ప్రవర్తించినట్లు దేవి ఫిర్యాదు చేసిందని, దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. విచారణలో నిజమని తేలితే తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

# 30న కార్మిక కర్షక రాష్ట్ర సదస్సు

- జయప్రదం చేయండి : సిఐటియు, రైతు సంఘం

**ప్రజాశక్తి - నంద్యాల**

విజయవాడలోని పీజీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 30న జరిగే కార్మిక కర్షక రాష్ట్ర సదస్సులో నంద్యాల జిల్లాలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం, సిఐటియు నాయకులు కోరారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్ కుమార్, ఏ.రాజశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఏసురత్నం,ఎ.నాగరాజులు రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ దుష్పరిపాలన నుండి రైతాంగాన్ని, శ్రామికులను కాపాడాలన్నారు. భారత వ్యవసాయానికి, రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను, ఎలక్ట్రిసిటీ బిల్ 2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటలన్నింటికీ డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం కనీస మద్దతు ధర సి2+50 చట్టబద్ధం చేయాలన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని, కేరళ తరహా రైతు రుణ ఉపశమన చట్టంను పార్లమెంటులో ఆమోదించి రైతుల ఆత్మహత్యలు అరికట్టాలన్నారు. లక్షలాది కార్మికులు పలు దశాబ్దాల పాటు శాంతియుతంగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికుల హక్కులను ప్రయోజనాలను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కర్షకులు, కార్మికులు సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 30న విజయవాడలో రాష్ట్రస్థాయిలో సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సుకు ఢిల్లీ నుండి అఖిలభారతస్థాయి కార్మిక సంఘాల, రైతు సంఘాల నేతలు హాజరవుతున్నారని, నంద్యాల జిల్లాలోని కర్షకులు, కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామ చంద్రుడు, ఏ. సురేష్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వి.బాల వెంకట్, డి.రత్నమయ్య, రైతు నాయకులు సర్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎపి రైతు సంఘం, సిఐటియు జిల్లా నాయకులు

# పకడ్బందీగా ఫీవర్, ఎన్‌సిడి-సిడి సర్వే

- డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకట రమణ

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ఆశాలు, సిబ్బంది ఫీవర్, ఎన్‌సిడి-సిడి సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ ఆర్.వెంకట రమణ ఆదేశించారు. శనివారం సర్వజన వైద్యశాల ఎంసిహెచ్ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిల నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పిహెచ్‌సి, యుపిహెచ్‌సి నోడల్ అధికారి జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, మాతా శిశుసంరక్షణ సేవలు, ఆర్‌సిహెచ్ పోర్టల్, హెచ్ఎంఐఎస్ పోర్టల్, సిఎస్ఎస్ఎం మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు తిరిగి పక్కాగా సర్వే నిర్వహించాలన్నారు. మిస్ అయిన 0-5 సంవత్సరాల పిల్లలకు, గర్భవతులకు, మూడు విడతలుగా వ్యాధినిరోధక టీకాలు నెలకు 6 పని రోజుల చొప్పున 3 నెలలు ఆగస్ట్, సెప్టెంబర్ అక్టోబర్ నెలలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు పోర్టల్ మీద ఆశాలకు అవగాహన కల్గించాలని ఆశా నోడల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ శారదా బాయి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అవుకు మల్లికార్జున రెడ్డి, ప్రోగ్రాం నోడల్ అధికారులు, ఆశా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పి. లింగేశ్వర్ రెడ్డి

## ఘనంగా నారాయణ కాలేజీ వార్షికోత్సవం

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాలలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో నారాయణ కాలేజీ 13వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ పి.లింగేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలపై శ్రద్ధ చూపి చక్కని ప్రతిభను కనబరుస్తున్నారని అన్నారు. జెఇఇ అడ్వాన్స్, జెఇఇ మెయిన్స్, ఏపీసెట్, ఎంసెట్, ఐపిఈ పరీక్షలలో, సాంస్కృతిక, క్రీడా రంగంలో చక్కని ప్రతిభను కనబరచిన విద్యార్థినీ విద్యార్థులకు మెమెంటోలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీన్ విశ్వనాథ్ రెడ్డి, ఎజిఎం అంజన్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ క్రిష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సినీ ఫక్కీలో రూ. 2 కోట్లతో పరారీ

- రియల్ ఎస్టేట్ వ్యాపారిని బురిడీ కొట్టించిన నకిలీ ముఠా

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల శివారు ప్రాంతంలోని రైతునగర్ వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి గోపిరెడ్డి మదన్ మోహన్ రెడ్డిని కొందరు బురిడీ కొట్టించి రూ. 2 కోట్లతో పరారీ అయ్యారు. వివరాలు.. గోపిరెడ్డి మదన్ మోహన్ రెడ్డిని తమ వద్ద 2 వేల నోట్లు ఉన్నాయని, వాటిని మార్చి ఇస్తే అదనంగా రూ.2 కోట్లకు రూ.3 కోట్లు ఇస్తామని చెప్పి నమ్మబలికినట్లు సమాచారం. రూ. 500 నోట్ల కట్టలు రూ. 2 కోట్లు తీసుకున్నాక సినీఫక్కీ తరహాలో పోలీస్ సైరన్‌తో నకిలీ ముఠా డబ్బుతో పరార్ అయింది. ఫేక్ పోలీస్ సైరన్‌తో రూ. 2 కోట్లు ముఠా సభ్యులు కొట్టేయడంతో బాధితుడు షాక్ అయ్యాడు. వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. ప్రత్యేక పోలీస్ బృందాలతో ముఠా కోసం నంద్యాల పోలీసులు గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కెడిసిసి చైర్మన్‌ను కలిసిన జడ్పిటిసి

**ప్రజాశక్తి - అవుకు :** ఉమ్మడి జిల్లా కెడిసిసి బ్యాంకు చైర్మన్‌గా ఎన్నికైన ఎస్‌వి విజయ మనోహరిని అవుకు మండల జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం కర్నూలులోని ఎస్వీ నివాసంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో యువ నాయకులు చల్లా విక్రాంతరెడ్డి, చల్లా చరణ్ రెడ్డిలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల, విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు నాగేశ్వరరావు

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

మున్సిపల్ కార్మికులు, గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు, గ్రామ రెవెన్యూ సహాయకుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలి, వీఆర్ఏలకు రూ 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలి, నామినీ గా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలి, వీఆర్ఏలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి, డిఏను వేతనం నుండి మినహాయించటాన్ని విరమించుకోవాలి, అర్హత కలిగిన వారికి విఆర్ఓ, అటెండర్ ,వాచ్మెన్, పోస్టులు కల్పించాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల, పాదయాత్ర సమయంలో అంగన్వాడీ కార్మికులు, ఆశా వర్కర్స్, స్కీమ్ వర్కర్స్‌కు చెప్పిన హామీలను నెరవేర్చాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి ఆశా వర్కర్స్, స్కీమ్ వర్కర్స్, గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించకపోతే వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సిపిఎం మద్దతు తెలుపుతుందని, ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పకీరు సాహెబ్, వేణుగోపాల్, వ్యకాసం నాయకులు వెంకటేశ్వర్లు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపివి అసత్య ఆరోపణలు : మున్సిపల్ చైర్మన్

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

**ప్రజాశక్తి-డోన్**

ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్‌లో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే టిడిపి నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శనివారం పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే కొత్తగా నిర్మించిన ఇండోర్ స్టేడియం కారుతోందని టిడిపి ఇంచార్జి ధర్మవరం సుబ్బారెడ్డితో పాటు మిగతా టిడిపి నాయకులు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇండోర్ స్టేడియం ఎక్కడైనా కారినట్లు చూపించాలని సవాలు విసిరారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అభివృద్ధికి సంబంధించి టిడిపి నాయకులు సలహాలు సూచనలు ఇచ్చిన స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు మల్లికార్జున రెడ్డి,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బావులకు రక్షణ గోడలు నిర్మించాలి : ప్రజా సంఘాలు

రోడ్డు పక్కన ఉన్న బావులను పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నేతలు

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

ఆత్మకూరు నుండి సంగమేశ్వరం వరకు రోడ్డు ప్రక్కన ఉన్న వ్యవసాయ బావులు ప్రయాణికుల వాహనాలకు ప్రమాదకరంగా ఉన్నాయని, ఆర్ అండ్ బి అధికారులు బావులకు రక్షణ గోడలు నిర్మించి ప్రయాణికులకు భద్రత కల్పించాలని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు డిమాండ్ చేశారు. శనివారం నాడు ప్రమాదకరమైన బావులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు నుండి సంగమేశ్వరం వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా లింగాపురం, శివపురం, సింగరాజు పల్లి, గుమ్మడపురం, ముసలమడుగు, తదితర గ్రామాల్లో రోడ్డుకు ఆనుకునే వ్యవసాయ బావులు ఉన్నాయని, వాహన చోదకులు ఏ మాత్రం పొరపాటుకు గురైన తీవ్రమైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. బావులకు రక్షణ గోడలు నిర్మించాలని కోరారు. ఇంద్రకర్(నాని), రాము, దేవ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరి దేవి ఆలయంలో లబ్బి వెంకటస్వామి పూజలు

ప్రత్యేక పూజలు పాల్గొన్న లబ్బి వెంకటస్వామి

**ప్రజాశక్తి - నందికొట్కూరు**

శ్రీ చౌడేశ్వరి అమ్మవారి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా వైసీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి నందికొట్కూరు పట్టణంలో చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానంతరం లబ్బి వెంకటస్వామిని ఆలయ కమిటీ నిర్వాహకులు చైర్మన్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో సన్మానించారు. లబ్బి వెంకటస్వామి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలు, రైతులు అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ,ఆలయ కమిటీ నిర్వాహకులు, మిడుతూరు నాగిరెడ్డి, కిరాణం మర్చంట్ అసోసియే షన్ అధ్యక్షులు మన్సూర్ బాష, ఉమ్మడి జిల్లా మైనార్టీ జోనల్ ఇంచార్జ్ అబు బాకర్, తదితరులు పాల్గొన్నారు.

## రుద్రవరం వాసికి డాక్టరేట్

పిహెచ్‌డి డాక్టరేట్ అందుకుంటున్న గంగిశెట్టి వెంకటేష్

**ప్రజాశక్తి - రుద్రవరం**

రుద్రవరంకు చెందిన గంగిశెట్టి వెంకటేష్ చెన్నై ఐఐటిలో డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. రుద్రవరం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు గంగిశెట్టి తిమ్మయ్య, రమాదేవి దంప తుల కుమారుడు గంగిశెట్టి వెంకటేష్ చెన్నైలోని ఐఐటి మెకానిక్ విభాగంలో పిహెచ్‌డి డాక్టరేట్‌ను హెచ్ఒడి చంద్రమౌళి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ పురస్కారం అందుకున్న విద్యార్థిని పలువురు గ్రామస్తులు, నాయకులు అభినందించారు.

### ప్రధాని, కేంద్ర హోం మంత్రి, మణిపూర్ సిఎంలు

# రాజీనామా చేయాలి

(5వ పేజీ తరువాయి...) ఉద్దేశంతో ఇంటర్నెట్ సేవలను ఆపి క్రైస్తవుల జాతిని ఒక క్రమ పద్ధతిలో నిర్మూలించటానికి మౌనం వహించడం దుర్మార్గమన్నారు. నెలన్నర క్రితం వెయ్యి మంది మతోన్మాదులు ఇద్దరు మహిళలను నగ్నంగా వీధుల వెంట ఊరేగిస్తూ వాళ్లను చెరబడుతున్న వీడియోలు వైరల్ అయి బయటిదేశాలు మన నేతలను దుమ్మెత్తి పోస్తుంటే మౌనం దాల్చడం దౌర్భాగ్యమని, ఆఖరికి నోరు తెరిచిన ప్రధానికి ఇంతటి తీవ్ర విషయం గురించి మాట్లాడడానికి కేవలం 36 సెకండ్లు కేటాయించడం దేశంలోని మహిళల గౌరవం పట్ల ఆయన చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. రాబోయే ఎన్నికలలో మోదీ హటావ్ దేశ్ బచావ్ నినాదంతో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. మహిళలపై ఆకృత్యాలకు పాల్పడిన వారికి ఉరిశిక్ష విధించి, భవిష్యత్తులో ఇటువంటి ఆకృత్యాలు చేయడానికి ఎవరైనా భయపడేలా శిక్షించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో జమాతే ఇస్లామి అమీర్ ఎ జమాత్ ఎస్. అబ్దుల్ సమద్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు మస్తాన్వలి, టిడిపి యువ నాయకులు ఎన్ఎండి ఫిరోజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, కాంగ్రెస్ సేవాదళ్ మస్తాన్, ప్రతాప్, క్రిస్టియన్ జెఎసి తెలంగాణ, ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు పాస్టర్ జానయ్య మన్యం, ఫ్రీలాన్స్ జర్నలిస్టు డా.జి.బాలస్వామి, వికలాంగుల రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సుధాకర్, పాస్టర్ పాలరాజు, ప్రసాద్ ఆర్టిసి, ప్రభుదాస్, ఐయుఎంఎల్ అధ్యక్షులు మౌలానా అబ్దుల్ సలాం, జమీయతే ఉలేమా అధ్యక్షులు మౌలానా ఖలీల్ సంగమి, ఆవాజ్ నాయకులు సద్దాం, ఇమాముల సంఘం నాయకులు మౌలానా అబ్దుల్లా, ముల్లా ఖాజా హుస్సేన్, దళిత గిరిజన రాష్ట్ర నాయకులు స్వామి నాయక్, వెల్ఫేర్ పార్టీ నాయకులు అలీం, పి.వి.ముస్తఫా, మహబూబ్ బాషా, ఖాదర్ భాషా, ఫయాజ్, అబ్దుల్ మునీర్, జమునా బాబు, మోహన్, ప్రవీణ్ బాబు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

**నిందితులను ఉరి తీయాలి**

**నంద్యాల రూరల్ :** మణిపూర్‌లో కుకీ తెగ స్త్రీలను బహిరంగంగా వివస్త్రలను చేసి హత్య చేసిన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని దళిత బహుజన ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణలోని నిశాంతి భవనంలో దళిత బహుజన ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం కమిటీ అధ్యక్షులు మేకల లింగస్వామి అధ్యక్షతన జరిగింది. గౌరవాధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఏసివి సుబ్బయ్య, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు వనుము శ్రీనివాసులు, వికలాంగుల రాష్ట్ర అధ్యక్షులు గంటల గిరి, జాకబ్ విజన్ టివి సీఈవో, కొమ్ముపాలెం సునీల్ తదితరులు మాట్లాడారు.

**బనగానపల్లె :** మణిపూర్‌లో మహిళలను అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించి హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకట లక్ష్మమ్మ, ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ బాలకృష్ణలు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నిందితులను ఉరి తీయాలన్నారు. సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**డోన్ :** మణిపూర్ ఘటనపై ఐద్వా, డివైఎఫ్ఐల అధ్వర్యంలో పట్టణంలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సంధ్బంగా ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు షేమిమ్ బేగం, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి,ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇర్ఫాన బేగం,మండల అధ్యక్ష కార్యదర్శులు మహబూబ్ బాషా,అశోక్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం కావాలనే మౌనం వ్యక్తం చేయడంతో ఘోరాలు జరుగుతున్నాయని అన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేసి ప్రభుత్వన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ నాయకురాలు గౌసియా,మా దేవి,షాబానా,లక్ష్మీ దేవి, విజయ లక్ష్మి,సులోచన,ముంతాజ్ బేగం,లావణ్య, క్రిష్ణవేణి,డివైఎఫ్ఐ నాయకులు రామలింగం, పవన్, రాజ శేఖర్, ఖాసీం,ప్రభాకర్,శ్రీనివాసులు,ఎస్ఎఫ్ఐ కోశాధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**పాములపాడు:** మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బహుజన సమాజ్ పార్టీ నందికొట్కూరు అసెంబ్లీ ఇన్చార్జి ఎల్ స్వాములు సేవా భారతి వై ఆర్ డి ఎస్ అధ్యక్షులు సర్ఫుద్దిన్ అలీ మాట్లాడుతూ మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బిరణ్ సింగ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ మండల నాయకులు బాల యేసు, మాల మహానాడు నాయకులు అబ్రహం, అంకన్న, బీసీ సంఘం నాయకులు రామకృష్ణుడు, అంబేద్కర్ ఇండియన్ మిషన్ అధ్యక్షులు బాలస్వామి, తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూర్ :** మణిపూర్‌లో గిరిజన మహిళపై అత్యాచారం చేసిన వారిని శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఎపి వ్యకాసం జిల్లా కార్యదర్శి కె. రాధాకృష్ణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసులు, పాములపాడు సిపిఐ కార్యదర్శి ప్రసాద్,సహాయ కార్యదర్శి రణ ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం నాడు వారు స్థానిక సిపిఐ కార్యాలయంలో మాట్లాడారు. మణిపూర్‌లో అల్లరి మూకల్ని అరెస్టు చేసిశాంతి నెలకొల్పాలని, ప్రధాని మోడీ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

**దేశంలో మహిళలకు రక్షణ కరువు : ఆవాజ్ కమిటీ**

**నందికొట్కూరు :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత దేశంలో బీసీ,ఎస్సీ, ఎస్టీ,ముస్లిం మైనార్టీ లపై దాడులు పెరిగి పోయాయని ముఖ్యంగా మహిళలకు రక్షణ కరువైందని ఆవాజ్ కమిటీ పట్టణ అధ్యక్షులు అబ్దుల్లా అన్నారు. ఆవాజ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో అబ్దుల్లా మాట్లాడారు. మణిపూర్ ఘటనపై ముఖ్యమంత్రి బిరణ్ సింగ్ బాధ్యత వహించి తక్షణమే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ కమిటీ ఉపాధ్యక్షులు రఫీ, ఖలీఫతుల్లా, నాయకులు నాగార్జున, హోటల్ ఫారుక్,రఫీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిడిపిఒ

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : సిడిపిఒ

**ప్రజాశక్తి - పాములపాడు**

అంగన్వాడి కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిడిపిఓ మంగవల్లి అన్నారు. శనివారం పాములపాడు, కంబాలపల్లి అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పౌష్టికాహారం మెనూపై ఆరా తీశారు. ఎస్సీ కాలనీ అంగన్వాడి కేంద్రం నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికిని రంగులు వేయలేదని టీచర్ శివలక్ష్మి ఏ సిడిపిఓ దృష్టికి తీసుకురాగా సిడిపిఓ ఎంపీడీవోతో చరవాణిలో మాట్లాడి సంబంధిత కాంట్రాక్టర్ చేత రంగులు వేయించి పెండింగ్ పనులు పూర్తి చేయించాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో సోమవారం కార్యాలయం నందు సంప్రదించాలని ఆయన తెలిపినట్లు ఆమె తెలిపారు.

## సర్దుబాటు ఉత్తర్వులను రద్దు చేయాలి : ఎపిటిఎఫ్

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

అసంబద్ధమైన పనిసర్దుబాటు ఉత్తర్వులను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్, ఉపాధ్యక్షులు ఉమర్ లు డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూరులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల నిష్పత్తి ఆధారంగానే బదిలీలు జరిపి అస్థానాల్లో ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని, నియామకమైన స్థానాల్లో ఇంకా జీతాలు తీసుకునేలోపే నిబంధనలకు విరుద్ధంగా మండలం, డివిజన్ల పరిధిలో కాకుండా ఏకంగా జిల్లాలను మార్చేస్తూ పనిసర్దుబాటు పేరిట బదిలీలు చేయాలని ఉత్తర్వులు జారీచేయడం సరికాదని అన్నారు. ఇప్పటికీ జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లయితే వాటిని డీఎస్సీ ద్వారా నియమించాలే తప్ప ఒక జిల్లా నుంచి మరోజిల్లాకు పనిసర్దుబాటు పేరిట బదిలీ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమని అన్నారు. ఈ సమావేశంలో అసంఘం నాయకులు సుబ్రమణ్యం, దాసు, జక్కందాసు, రాజ్ కుమార్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం : ఎంఆర్‌పిఎస్

మాట్లాడుతున్న నాయకులు

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధన కోసం తమ పోరాటం ఆగదని నాయకులు తెలిపారు. ఆగస్టు రెండో వారంలో జరిగే చలో హైదరాబాద్ మాదిగల మూడో విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రభుత్వ అతిథి గృహంలో ఎంఎస్పి జిల్లా కో కన్వీనర్ కెపి పెద్ద ఓబులేసు మాదిగ, తాలూకా అధ్యక్షులు నాగిపోగుల పెద్ద ఓబులేసు మాదిగ, ఎంఈఎఫ్ ఆళ్లగడ్డ తాలూకా అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాదిగ, ఆళ్లగడ్డ తాలూకా మండల ఎంఎస్పి అధ్యక్షులు బాల ఓబులేసు మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఎస్ఎఫ్, విహెచ్‌పి హెచ్ అనుబంధ సంఘాలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా ఇన్చార్జి సుభాష్ చంద్ర మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కత్తి ఓబులేసు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు శివ నారాయణ మాదిగలు హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా మరో పోరాటానికై ఆగస్టు రెండో వారంలో జరిగే చలో హైదరాబాద్ మాదిగల మరో మహా విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పి తాలూకా ఇంచార్జ్ మేకల దస్తగిరి మాదిగ, జిల్లా నాయకులు రామాంజనేయులు మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా సీనియర్ నాయకులు ఎస్.ఓబులేష్ మాదిగ, దాసరి సత్యనారాయణ మాదిగ, నాగరాజు మాదిగ, లక్ష్మయ్య మాదిగ, మద్దూరు సంజీవ రాయుడు మాదిగ, హుసేని, మద్దిలేటి మాదిగ, వేణుగోపాల్ మాదిగ, మారెన్న, డక్కలి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## 25వ వార్డులో 'భవిష్యత్‌కు గ్యారెంటీ'

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

**ప్రజాశక్తి - నందికొట్కూరు**

నందికొట్కూరు పట్టణంలోని టిడిపి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం శనివారం పట్టణంలోని 25వ వార్డులో నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయ సూర్య జయ సూర్య ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐ టి డి పిముత్తు జావలి, క్లస్టర్ ఇంచార్జ్ జాకీర్ హుస్సేన్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షకీల్ అహ్మద్, పాణ్యం వేణుగోపాల్, పలుచాని మహేశ్వర్ రెడ్డి, కళాకర్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రాజు, బొల్లెద్దుల రాజన్న, బాషా,శేఖర్, అప్పరవలి, నరసింహారెడ్డి, పాలమారి నాగరాజు, టిడిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం పంపిణీ

నామినీకి తక్షణ ఆర్థిక సహాయం అందచేస్తున్న సర్పంచ్ పేరుమాళ్ళ శేషన్న

**ప్రజాశక్తి - పగిడ్యాల**

వైయస్సార్ బీమా పథకం కింద మృతుడి కుటుంబానికి తక్షణమే ఆర్థిక సహాయం అందజేసినట్లు సర్పంచు పెరుమాళ్ళ శేషన్న, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పగిడ్యాల గ్రామం కుంట వీధికి చెందిన షేక్ శాలిమియా (49) గుండె పోటుతో మృతి చెందగా నామిని షేక్ శాలుబీకి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, వాలంటీర్ నరేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ అనురాధ

## పాఠశాలను ఎంఇఒ ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి - చాగలమర్రి**

చాగలమర్రిలోని గుంత పాలెం కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ అనురాధ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలయ్యే మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఇఒ పరిశీలించారు. అనంతరం పాఠశాలలోనే వివిధ రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు సెమిస్టర్ టు పుస్తకాలను ఎంఈఓ అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం పాటించవలెనని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జైనులాబ్దీన్, ఉపాధ్యాయులు హనీఫ్ ,పెద్ద బాలయ్యలు పాల్గొన్నారు.

## మద్దిలేటి స్వామి ఆలయ ఆదాయం రూ.7.23 లక్షలు

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

మండలం ఆర్ఎస్ రంగాపురం పరిధిలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆదాయం శనివారం లెక్కించారు. స్వామి వారి భక్తులతో ఆలయం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు ముడుపులు విరాళాలు అన్నదానం చందాలు కేశఖండనం కళ్యాణకట్ట రూము అద్దెలు వివిధ రకాలుగా భక్తులు సమర్పించుకున్న సమర్పణల వల్ల రూ.7,23,528 వచ్చినట్లు ఆలయం ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమం చేసిన్నట్లు పేర్కొన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శనివారం నాడు ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావు పేట గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాణి, ఎంపీపీ నల్లకాల తిరుపాలమ్మ, వైఎస్ఆర్సిపి ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, ఆత్మకూరు మున్సిపాలిటీ కౌన్సిలర్ విజయ చౌదరి, గ్రామ వైసిపి నాయకులు పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**నందికొట్కూరు :** మండలంలోని బిజినవేముల గ్రామంలో ఎంపీడీవో శోభారాణి, ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తాసిల్దార్ రాజశేఖర్ బాబు, సర్పంచ్ రవి యాదవ్ పాల్గొని లబ్ధిదారులకు వివిధ ధృవీకరణ పత్రాలు అందజేశారు. డిప్యూటీ తాసిల్దార్ సత్య నారాయణ, పంచాయతీ సెక్రెటరీ రవీంద్రబాబు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు , పాల్గొన్నారు.

**బేతంచెర్ల:** మండల పరిధిలోని సీతారాంపురం ఎం పెండకల్లు గ్రామాలలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ఎంపీపీ బుగ్గన రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, ఎంపీడీవో వెంగన్న, డిప్యూటీ తాసిల్దార్ సత్యదీప్, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మురళికృష్ణ, గూని నాగరాజు, తిరుమలేశ్వర్ రెడ్డి, కోడే వెంకటేశ్వర్లు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

**పాములపాడు:** మండలంలోని తుమ్మలూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ, తాసిల్దార్ రత్న రాధిక, సర్పంచి వనమాల ప్రసాదరావు, వైసీపీ నాయకులు రామలింగేశ్వర రెడ్డి లబ్ధిదారులకు ధృవపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హాజిరాబి ఈఓఆర్డి శ్రీనివాస్ నాయుడు, ఏపీఎం అనురాధ, ఏపీవో విమలమ్మ, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, వైసీపీ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, జూటూరు మధు, అంబయ్య, రుద్రవరం సర్పంచి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**చాగలమరి :** జగనన్న సురక్షతో ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. మండలంలోని చింతల చెరువు, చిన్న వంగలి గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి వీరభద్రుడు, జెడ్పిటిసి సభ్యురాలు శ్రీమతి జి లక్ష్మీదేవి, మండల కన్వీనర్ జి కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాజేశ్వరి, వైసిపి నాయకులు, వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మిరెడ్డి, సుబ్రహ్మణ్యం, సుమన్, వేణు, సుదర్శన్ రెడ్డి, గణపతి రెడ్డి, ప్రసాదు, ఎంపీటీసీ శ్రీలక్ష్మి రెడ్డి, మాజీ జెడ్పిటిసి రామ గుర్విరెడ్డి, సర్పంచ్ మాలి బాష, గ్రామ వైసిపి నాయకులు రామకృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ వెంకటరామిరెడ్డి, ఎంఈఓ, ఇన్చార్జి తదితరులు పాల్గొన్నారు.

**మిడుతూరు :** మండలంలోని చింతలపల్లి వీపనగండ్ల గ్రామ సచివాలయం పరధిలో సర్పంచి శ్రీమతి చందాపురం భారతి అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఎంపిడిఒ జి.ఎన్.ఎస్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, డిప్యూటీ తాసిల్దారు, ఐసిడిఎస్ సూపర్వైజర్ గ్రామ నాయకులు తిమ్మారెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. చింతలపల్లిలో 610 ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, విఆర్ఓ మనోహర్ గౌడ్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**కొలిమిగుండ్ల :** సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మాయిపల్లి సర్పంచి మొలక రాజారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తోళ్ల మడుగు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం వైసిపి ప్రచార జిల్లా అధ్యక్షులు పేరం సత్యనారాయణరెడ్డి, ఉమ్మాయిపల్లె తండా సర్పంచి ఎస్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 11 రకాల పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి, నందిపాడు సర్పంచ్ గురువిరెడ్డి, మొలక ఓబుల్ రెడ్డి, కూర్మన్‌పల్లె రామ్నాథ్ రెడ్డి, అబ్దుల్లాపురం సర్పంచ్ ఎస్‌వి వెంకటేశ్వర రెడ్డి, వాలంటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికేట్లను అందజేస్తున్న మొలక రాజారెడ్డి

**అవుకు :** జగనన్న సురక్ష పథకం ప్రజలకు గొప్ప వరమని అవుకు ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని, అవుకు సచివాలయం-1లో, కొండమ్మనాయనపల్లె గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రజలకు సంబంధిత ధ్రువపత్రాలను ఎంపిపి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి చల్లా రఘునాథరెడ్డి, అవుకు ఈవో అశ్విన్ కుమార్, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

**ఆళ్లగడ్డ :** మండలంలోని అర్.కృష్ణాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపిడిఓ మహబూబ్ ఖాన్, పిఓపిఆర్డి తాహిర్ హుస్సేన్, మండల స్థాయి అధికారులు ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి లక్ష్మీదేవి, సర్పంచ్ సుభద్రమ్మ, నాయకులు నేట్ల కృష్ణారెడ్డి, రంగారెడ్డి, జగన్ మోహన్రెడ్డి, అశోక్ రెడ్డి, మర్రిపల్లి సర్పంచి పత్తి రాజేశ్వరి, తులసి, గ్రామ వాలంటీర్స్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చాగలమర్రి : సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీపీ మిడుతూరు : ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

పాడే మోస్తున్న దృశ్యం

## అనాథ శవానికి అంత్యక్రియలు

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

మండలంలో గూటుపల్లె గ్రామంలో అనాథ శవానికి ఆనలుగురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. 50 సంవత్సరాల వ్యక్తి అనాథ మృతి చెందాడని, అంత్యక్రియలు నిర్వహించాలని గ్రామస్తులు ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూరు బాషాను కోరగా ఆయన సభ్య బృందంతో కలిసి, స్థానిక స్మశానంలో మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సంస్థ సభ్యులు, నాగేశ్వర్ రెడ్డి రాఘువేంద్ర, సద్దాం, యూసుఫ్, అక్బర్, మభాష, గూటుపల్లె ముల్లా, తదితరులు పాల్గొన్నారు.

**త్రివర్ణ పతాకం గురించి అవగాహన**

**ప్రజాశక్తి-డోన్**

డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకం ఆమోదించిన రోజును గురించి విద్యార్థులకు శనివారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య త్రివర్ణ పతాకం ప్రతిపాదించారని, తదితర జెండా విశేషాలను వివరించారు. సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, వెంకటరమణ,వెంకట లక్ష్మీ, రాధ, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**O.S.No. 3/2021**

గుర్కా చంద్రశేఖర్‌రెడ్డి, తండ్రి సాంబశివారెడ్డి, వయస్సు 49 సం॥లు, హిందూ, లెక్చరర్, సాకిన్, అక్కంపల్లి గ్రామము, సంజామల మండలం, కర్నూలు జిల్లా. ప్రస్తుతం డి.నెం.3/404, సాయి కుటీర్‌రోడ్డు, వై.యం.ఆర్ కాలని, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ...వాది

Vs

కనకదండి సీతారామ మూర్తి, తండ్రి లేట్ వెంకటసుబ్బయ్య శర్మ, హిందూ, వయస్సు 45 సం॥లు, స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ హైస్కూలు, గోరివిమానిపల్లి గ్రామము, కొలిమిగుండ్ల మండలం, కర్నూలు జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

పై నెంబరు దావాను వాది దావా బాకీ మొత్తం రూ.3,06,500/-లను రాబట్టుకొనుటకు గాను నీపైన దాఖలు చేసి ఉంటూ ఉన్నాడు. అయితే పై నెంబరు దావా యందు ప్రతివాది అయిన నీవు హాజరు అగుటకుగాను 16-08-2023వ తేదీన వాయిదా ఉన్నది. అట్టి దావా నందు నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టువారి ఎదుట 16-08-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను, లేనంతట నీ పరోక్షమునందు తీర్మానించబడును.

వాయిదా తేది: 16/8/2023

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

బి.రాం ప్రసాద్‌రెడ్డి

అడ్వకేట్, ప్రొద్దుటూరు.